వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 53 | శుక్రవారం | 18 ఆగస్టు 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


8లో

## సర్వాయి పాపన్న వ్యక్తి మాత్రమే కాదు.. ఆయన ఒక శక్తి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



# లబ్ డబ్

## టికెట్ల టెన్షన్..

### బీఆర్ఎస్ బాస్ ఎవరికి బీఫారం అందిస్తారో..

- కాంగ్రెస్, బీజేపీ ఆశావహుల్లోనూ ఆందోళన
- సోషల్ మీడియాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ జాబితాలు హల్ చల్
- అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అంటున్న నేతలు
- మూడు పార్టీల్లోనూ వర్గపోరు
- హైదరాబాద్ లో మకాం వేసిన ఉమ్మడి జిల్లా నేతలు

వివరాలు 2లో..

టెన్షన్.. టెన్షన్.. సిట్టింగ్‌లు, ఆశావహుల్లో అదే టెన్షన్.. అధిష్ఠానం టిక్కెట్ ఎవరికి ఇస్తుందో..బీ ఫారం ఎవరికి దక్కుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇప్పటికే ఆశావహులంతా హైదరాబాద్‌లో మకాం వేసి టికెట్ కోసం పావులు కదుపుతున్నారు. సీఎం కేసీఆర్ అదృష్ట సంఖ్య ఆరు కలిసొచ్చేలా మొత్తం 78 మందితో బీఆర్ఎస్ తొలి జాబితాను శ్రావణ సోమవారం విడుదల చేసేందుకు రంగం సిద్ధం సేసినట్లు ప్రచారం సాగుతున్న తరుణంలో తమ పేరు మొదటి జాబితాలోనే ఉండాలని కోరుకుంటూ పలువురు యాగాలు, హోమాలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న జాబితా నిజమైనదేనా అంటూ ఆరా తీస్తున్నారు. పార్టీ పెద్దలే లిస్ట్ లీక్ చేశారా లేక ఊహాగానాలా అంటూ సమాచార సేకరణలో పడ్డారు. ఏది ఏమైనప్పటికీ సిట్టింగ్‌లు, ఆశావహులు టికెట్ టెన్షన్ తో సతమతమవుతున్నారు. - వరంగల్ వాయిస్, ప్రత్యేక ప్రతినిధి


8లో

## త్రిశక్తి స్వరూపిణిగా రుద్రేశ్వర స్వామి

శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని వేయి స్తంభాల దేవాలయంలోని రుద్రేశ్వర స్వామిని త్రిశక్తి స్వరూపిణిగా ప్రత్యేకంగా అలంకరించారు. రుద్రేశ్వరీ దేవి మహాకాళి, కొల్లాపూర్ మహాలక్ష్మి, మధుర మీనాక్షి, మహా సరస్వతి రూపంలో శుక్రవారం ప్రజలకు దర్శనమిచ్చారని ఆలయ అర్చకులు గంగు మణికంఠ తెలిపారు. అలాగే ప్రతి మహిళ మహా సరస్వతి స్వరూపిణిగా, మహాలక్ష్మిగా, మహాకాళిగా తన ప్రతాపం చూపించాలన్నారు. ఈ శ్రావణమాసం ప్రతి ఒక్కరూ సౌభాగ్యంగా ఉండాలని ఆశిస్తూ అందరికీ కూడా ఆ రుద్రేశ్వర స్వామి వారి అనుగ్రహాలు ఉండాలని ప్రార్థిస్తున్నానని అర్చకులు మణికంఠ వెల్లడించారు.
- వరంగల్ వాయిస్, హనుమకొండ


8లో

## మావోయిస్టు అగ్రనేత రాజిరెడ్డి మృతి


8లో

## భక్తులతో పోటెత్తిన అమ్మవారి ఆలయాలు

# లబ్ డబ్
# టికెట్ల టెన్షన్..



**బీఆర్ఎస్ బాస్ ఎవరికి బీఫారం అందిస్తారో..**

**కాంగ్రెస్, బీజేపీ ఆశావహుల్లోనూ ఆందోళన**

**సోషల్ మీడియాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ జాబితాలు హల్ చల్**

**అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అంటున్న నేతలు**

**మూడు పార్టీల్లోనూ వర్గపోరు**

**హైదరాబాద్‌లో మకాం వేసిన ఉమ్మడి జిల్లా నేతలు**

**వరంగల్ వాయిస్, ప్రత్యేక ప్రతినిధి :** ఎన్నికల సమీపిస్తున్న వేళ ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అధికార బీఆర్ ఎస్ పార్టీ ముచ్చటగా మూడో సారి విజయం సాధించాలన్న లక్ష్యంలో ముందుకు సాగుతుండగా భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలు ఈ సారి ఎలాగైనా విజయం సాధించి తెలంగాణలో పాగా వేయాలన్న సంకల్పంతో ఉన్నాయి. ముక్కోణపు పోటీలో ఎవరు విజేతలుగా నిలుస్తారన్నది అటుంచితే మూడు పార్టీలు వర్గపోరుతో మాత్రం సతమతమవుతున్నాయి. ఎవరికి వారు టికెట్ తమకే అంటే కాదు.. కాదు..తమకే అంటూ నియోజకవర్గాల్లో తిరుగుతూ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా అధికార బీఆర్ఎస్ తొలి జాబితా విడుదల చేసేందుకు సిద్ధమైంది. సీఎం కేసీఆర్ 78 మందితో కూడిన జాబితాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చేతులమీదుగా శ్రావణ శనివారం రోజున ఆవిష్కరిస్తారని జోరుగా ప్రచారం సాగింది. అయితే అనివార్య కారణాల వల్ల వాయిదా పడి శ్రావణ సోమవారం తొలి జాబితా విడుదల కానున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే కాంగ్రెస్ లో ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రకటన ఇచ్చినప్పటికీ అంతకు ముందే కొంతమంది సీనియర్లతో జాబితా రెడీ అయ్యిందని, ఈ మేరకు వారి పేర్లతో కూడిన లిస్ట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. బీజేపీ కూడా నియోజకవర్గాల్లో సర్వే పూర్తి చేసిందని, గెలుపు గుర్రాలకే టికెట్ కేటాయించే అవకాశం ఉందని సమాచారం.

## పోరు రసవత్తరం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉన్నాయి. అన్ని నియోజవకర్గాల్లోనూ పోరు రస్తవత్తరంగా మారనున్నది. 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పది, కాంగ్రెస్ రెండు స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ ఖాతా తెరవలేదు. అయితే, ఎన్నికల సమయం ఆసన్నం కావడంతో మూడు పార్టీల నేతలు ప్రజలతో మమేకమవుతూ తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని, మళ్లీ బీఆర్ఎస్ గెలుస్తుందని అధికార పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ మాత్రం అధికార పార్టీ అవినీతి, బీఆర్ఎస్ నేతల అక్రమాలు, ఆరాచకాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. అధికార బీఆర్ ఎస్ పార్టీకి కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయం అన్న సంకేతాలను ప్రజలకు భలంగా వినిపిస్తున్నారు. బీజేపీ నేతలు కూడా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయ తీరం చేరేందుకు మూడు పార్టీల నేతల చెమటోడుస్తున్నారు.

## మొదలైన టికెట్ల వేట..

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఆశావహులు ఇప్పటికే టికెట్ల వేటలో నిమగ్నమయ్యారు. పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు నానా ఆగచాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ఆశావహులు హైదరాబాద్, ఢిల్లీలో మకాం వేసి టికెట్ల కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రతిపక్షాలను ఇరకాటంలో పెట్టేందుకు తుది జాబితా రెడీ అయ్యిందని, తర్వలో అభ్యర్థుల ప్రకటన చేస్తామంటూ అధికార పార్టీ నేతలు లీక్ లు ఇస్తున్నారు. కాగా, కాంగ్రెస్ జాబితా సిద్ధమైందని, ఇదిగో టీపీపీసీ రేవంత్ రెడ్డి అధ్యక్షుడి టీం అంటూ ఓ జాబితా వాట్సప్ లో చక్కర్లు కొడుతోంది. అయితే దీనిపై రేవంత్ రెడ్డి స్పందించారు. వాట్సప్ లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని చెప్పారు. అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం చేతుల్లో ఉందని, పనితీరే ప్రమాణికంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. కానీ, ఇంతవరకు బీజేపీకి సంబంధించిన లీకులు మాత్రం బయటికి రావడంలేదు. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాతే బీజేపీ లిస్ట్ బయటకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.



## మూడు పార్టీల్లో వర్గపోరు..

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మూడు పార్టీలు వర్గపోరుతో సతమతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడే జాబితా విడుదల చేస్తే పార్టీకి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే, అధికార బీఆర్ఎస్ మాత్రం ఒకడుగు ముందుకేసి జాబితా రెడీ చేసింది. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో మంచిరోజు, బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ శుభముహుర్తం చూసి ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఈ సారి జాబితా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం తన అమెరికా పర్యటను రద్దు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## ఎవరికి దక్కే'నో'..

బీఆర్ఎస్ తొలి జాబితా అంటూ కొంతమంది పేర్లతో కూడిన ఓ లిస్ట్ ఇటీవల వాట్సప్ గ్రూపుల్లో తెగ వైరల్ అవుతోంది. ఇందులో ఉమ్మడి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల పేర్లు లేవు. దీంతో ఆయా నియోజవర్గాల సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహుల్లో ఉత్కంఠ, ఆందోళన నెలకొంది. పలువురు ఎమ్మెల్సీలు కూడా ఈ నియోజకవర్గంలో టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లు బయటికి రాకపోవడంతో చర్చనీయాంశంగా మారింది. గులాబీ బాస్ కేసీఆర్ ఎవరికీ బీఫారం ఇస్తారోనని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ పార్టీ నుంచి ఎవరు బరిలో దిగుతారో తెలియాలంటే మరికొద్ది రోజులు వేచిచూడాల్సిందే..

## మొక్కలు పెంచండి..ఆరోగ్యంగా జీవించండి: కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో ముఖ్యమని వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మొక్కలు పెంచండి.. ఆరోగ్యంగా జీవించండి అంటూ ఆమె సూచించారు. పర్వతగిరి మండలంలో మారి స్వచ్ఛంద సంస్థ, నవ జీవన మ్యాక్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న 373వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హైదరాబాదు నుంచి ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు తీరుపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, స్మార్ట్ సిటీ పనులను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అధికారులను ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలో జీడబ్ల్యూఎంసీ, కూడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, కూడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్రాజు యాదవ్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాష తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ మాట్లాడుతూ... హనుమకొండ నగరంలోని డివిజన్ల పరిధిలో జరుగుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. రానున్న ఒకటి, రెండు నెలల్లో పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కాళోజి కళా క్షేత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి ఉందన్నారు. కాళోజీ కళా క్షేత్రం పనుల్లో వేగం పెంచాలని, కాళోజి జయంతి నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని కుడా అధికారులను ఆదేశించారు. అలాగే జంక్షనులను, ఆలయాలను అభివృద్ధి చేయాలన్నారు. పద్మాక్షి ఆలయం, జైన్ టెంపుల్, కాపువాడ నరసింహస్వామి ఆలయాలను పరిధిలో అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. సరిగమ పార్క్, మ్యూజికల్ గార్డెన్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ, కూడా అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, ఇరిగేషన్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బహుజనుల ఆదర్శ నాయకుడు సర్దార్ పాపన్న



**వరంగల్ వాయిస్, జనగామ :** గౌడ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జనగామ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బహుజనాలు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన గొప్ప సామాజిక విప్లవకారుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో మన గౌడ్ లను గెలిపించాలని, తక్కువ సీట్లు కేటాయిస్తే తమ సత్త చూపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్రెముల యాదగిరి గౌడ్, గౌరవ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా పరశురాములు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గూడ రాజ బోస్ గౌడ్, కోశాధికారి మడిపల్లి ఐలయ్య గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు మాచర్ల ప్రభాకర్ గౌడ్, బైరవల్లి శ్రీనివాస్ గౌడ్, దూడల రమేష్ గౌడ్ ,దూడల రాజ సంపత్ గౌడ్ ,అంబటి అంజయ్య గౌడ్, రంగు భాస్కర్ గౌడ్, వి. విజయకుమార్ గౌడ్, రాం నర్సయ్య గౌడ్, బురుగు శ్రీనివాస్ గౌడ్, తొలుపునూరి రాంచంద్ర గౌడ్, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# దేశానికే దిక్సూచిగా తెలంగాణ

## ఈ ఘనత సీఎం కేసీఆర్‌దే
## పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి
## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం నడికూడ మండలంలో చర్లపల్లి, రాయపర్తి, నడికుడ గ్రామాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. పర్యటనలో భాగంగా రూ.3కోట్ల 68లక్షల 90వేలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. చర్లపల్లి గ్రామంలో రూ.20లక్షలతో గ్రామపంచాయతీ భవనం,రూ.33.90లక్షలతో ప్రాథమిక పాఠశాలలో పూర్తయిన మౌలిక వసతుల కల్పన పనుల ప్రారంభం, రాయపర్తి గ్రామంలో రూ.2కోట్ల 75లక్షలతో రాయపర్తి గ్రామం నుంచి నడికూడ గ్రామం వరకు నూతన బీటీ రోడ్డు పనులకు శంఖుస్థాపన, నడికూడ గ్రామంలో రూ.20లక్షలతో మహిళ భవనం, రూ.20లక్షలతో గ్రామపంచాయతీ భవనం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా నడికూడ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు మాట్లాడుతూ. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే దిక్సూచిగా మారాయని అన్నారు. నాడు వ్యవసాయం దండగ అని గత పాలకులు అన్నారు. నేడు కేసీఆర్ కృషితో వ్యవసాయం అద్భుత ప్రగతి సాధించిందని వివరించారు. సమైక్య రాష్ట్రంలో ఆనాటి పాలకులు తెలంగాణలో వ్యవసాయాన్ని చిన్నచూపు చూశారని, రైతుల బాధలను అవహేళన చేశారని అన్నారు. మహిళల్లో ఆర్థిక చైతన్యం పెరిగి, సామాజికంగా గౌరవం దక్కేలా పారిశ్రామికవేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసిన ఘనత సీఎం కేసీఆర్ కు దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అన్ని అవకాశాలు కల్పించామని వెల్లడించారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నియోజకవర్గంలోని కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, ప్రజలందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనీయుడు సర్వాయి పాపన్నగౌడ్

## కలెక్టర్ సిక్తా పట్నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ పోరాటంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఎంతో ధైర్యసాహసాలతో పోరాడిన మహనీయుడని, ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373జయంతిని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేసిన ఎందరో మహనీయులు ఉన్నారని వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసి ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి తీసుకువచ్చారని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప ధీరుడు, ధీశాలి, విప్లవకారుడు, యోధుడు, బహుజన సాధనకు ఎంతో కృషి చేశారనన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం గీత కార్మికుల శ్రేయస్సుకు ఈత చెట్లను పెంచడం, గీత కార్మికుల పెన్షన్ అందచేయడం జరుగుతోందని. కులవృత్తులు కనుమరుగు కాకుండా చూడాల్సిన అవసరం ఉందని చీఫ్ విప్ ఆకాంక్షించారు. అలాగే చరిత్రలో పోరాడిన వ్యక్తులకు సంబంధించిన వివరాలను పాఠ్యపుస్తకాల్లో కూడా చేర్చడం జరుగుతుందని చీఫ్ విప్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, బీసీ డీడీ రాంరెడ్డి, గౌడ సంఘం నాయకులు వెంకటనారాయణ గౌడ్, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, చిర్ర రాజు గౌడ్, బొనగాని యాదగిరి గౌడ్, జనగాం శ్రీనివాస్ గౌడ్, గోపి గౌడ్, లక్ష్మణ్ గౌడ్, ఏకాంతం గౌడ్ , వెంకట్రాజం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా గురువులు సమాజ సేవకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ కు చెందిన అనుశాసన బ్రహ్మా యోగ ఆధ్యాపక సంక్షేమ సమితి వారు చారిత్రాత్మక నగరమైన వరంగల్ నగరానికి భద్రకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ ఈ యాంత్రిక జీవితంలో అనేక ఒత్తిళ్లకు లోనవుతున్న క్రమంలో యోగ, ధ్యానంతో శాంతి మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుందని అన్నారు. యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు, అది మన మనస్సును, ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే ఒక మహోన్నత సాధనం అన్నారు. యోగా ఆరోగ్యానికి మంచిది యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందన్నారు. ఆధునిక బిజీ బిజీ లైఫ్ షెడ్యూల్ లో యోగాకు కొంచెం సమయం కేటాయించాలని, యోగా చేయడం వల్ల అనారోగ్య సమస్యలు కూడా దూరమవుతాయని అన్నారు.

# బిట్ల వర్షిణికి గోల్డ్ మెడల్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన హనుమకొండ జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిట్ల వేణుగోపాల్ కుమార్తె బిట్ల వర్షిని గోల్డ్ మెడల్ సాధించింది. వర్షిని వరంగల్ లోని కేంద్రీయ విద్యాలయంలో ఏడో తరగతి చదువుతుంది. ఆజాదీకా అమృత్ ఉత్సవ్ లో భాగంగా యంగ్ ఎన్విఇంటర్నేషనల్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి పెయింటింగ్ కాంపిటిషన్ లో 'మై మదర్ ల్యాండ్ ' అనే అంశంపై బంగారు పథకాన్ని సాధించింది.

# అభివృద్ధి ప్రదాత చల్లాకు కృతజ్ఞతలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామంలో శుక్రవారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల పర్యటనలో భాగంగా రాయపర్తి నుంచి నడికూడకు బీటీ రోడ్డు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పర్లం తిరుపతిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన మండల కేంద్రానికి వెళ్లడానికి సరైన దారి లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్న వేళ, సుమారు 1975 సంవత్సరం నుంచి హనుమకొండ మొగుళ్లపల్లి మార్గం పూర్తిగా మూసుకుపోవడంతో రాయపర్తి, నర్సక్కపల్లి, నడికూడ గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున, గత పాలకులు ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే ధర్మారెడ్డి చొరవ తీసుకొని రూ.2.75 కోట్లతో రోడ్డు మంజూరు చేసి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ పంచాయతీ పాలకవర్గం తరపున, గ్రామ ప్రజలు, రైతుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# భద్రకాళి దేవస్థానం ఈవో శేషు భారతికి పదోన్నతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీ భద్రకాళి దేవస్థానం ఈవో శేషు భారతికి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా పలువురు, ఆలయ ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# అంబులెన్సులను ప్రారంభించిన చీఫ్ విప్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో నూతన 108, 102 అంబులెన్సులను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భగా చీఫ్ విప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకవైపు సంక్షేమం మరొక వైపు అభివృద్ధితో పాటు ముందుకు సాగుతుందని అన్నారు. ప్రజలందరి సంక్షేమం కోసం అనేక వర్గాల అభ్యున్నతి కోసం, వారి ఆర్థిక ఎదుగుదల కోసం, అనేక పథకాల అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. ఆపదలో ఆదుకొని వారిని సురక్షితంగా దగ్గరలో ఉన్నటువంటి హాస్పిటల్ లకు తరలించి, వారి ఆరోగ్య పరిస్థితి మెరుగయ్యే వరకు సేవలందిస్తున్నటువంటి 108 ఉద్యోగస్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్(బీఆర్ఎస్) ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, దానిలో భాగంగానే సేవలు శరవేగంగా అందించడానికే అంబులెన్స్ లను అధికంగా మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్, వైద్య ఆరోగ్య విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు అండగా ఎర్రజెండా

## సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇబ్బందులకు గురైన వరద బాధితులకు సీపీఎం హనుమకొండ సౌత్ మండల కమిటీ ఆఫీస్ లో, ఎంఆర్ భవన్ మేకల రఘుపతి స్మారక భవనంలో, మహాత్మ జ్యోతిరావు పూలే నగర్ లో మండల కార్యదర్శి మంద సంపత్ అధ్యక్షతన శుక్రవారం ప్రతి కుటుంబానికి 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరదల కారణంగా గుడిసెలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అందువల్ల 200కుటుంబాల వారికి వెంటనే పక్కా గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదలు బీభత్సం సృష్టించితే స్వచ్ఛంద సంస్థలు సహాయ కార్యక్రమాలు తప్ప ప్రభుత్వం నుంచి ఎలాంటి వరద సహాయం అందలేదని ప్రశ్నించారు. బాధితులు అధైర్య పడవద్దని, ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం మంద సంపత్ మాట్లాడుతూ కోట చెరువు, బంధం చెరువు, 964 భూపోరాటల్లో సుమారు 18నెలలుగా నిరుపేద ప్రజలు నీడ ఏర్పర్చుకొని జీవనం కొనగిస్తున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 200 కుటుంబాలు ఆశ్రమం కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందలేదన్నారు. సీపీఎం హనుమకొండ సౌత్ మండల కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటూ, భోజన వసతి, బెడ్ షీట్స్ పంపిణీ, అలాగే బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్, మిశ్రీన్, మండల కమిటీ సభ్యులు అలకుంట్ల యకయ్య, దూడపాక రాజేందర్, నోముల కిషోర్, కంచర్ల కుమరస్వామి, ఎన్నాం వెంకటేశ్వర్లు, పల్లకొండ శ్రీకాంత్, రమేష్, రాజు, సంపత్ పాల్గొన్నారు.

# బహుజన వీరుడు సర్దార్ పాపన్న గౌడ్

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** నాటి మొగలుల పరిపాలన కాలంలోనే బహుజన రాజ్యం కోసం పరితపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం మానుకోట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బూరుగు శ్రీకాంత్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తొర్రూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో గౌడ కులస్తులతో కలిసి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బూరుగు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ పాపన్న గౌడ్ పోరాట పటిమను ఆయన పౌరుషాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. 300వందల సంవత్సరాల కంటే ముందే బహుజన రాజ్యం కోసం గోల్కొండ కోటను అధిరోహించి గోల్కొండ సింహాసనం వశపరుచుకున్న బడుగు, బలహీన వర్గాల నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక గౌడ కులానికే కాకుండా బీసీ సామాజిక వర్గానికి, అన్ని కులాలకు సహకరించిన ధీరుడని, పెత్తందారులను ఎదిరించి పేద ప్రజలకు అండగా నిలిచి ఆదుకున్నారని గుర్తు చేశారు. పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని, పాపన్న



గౌడ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొండ యాకన్న గౌడ్, జర్నలిస్టు రమేష్ గౌడ్, వెంకటాపురం గౌడ సర్పంచ్ నిమ్మల సాయిలు గౌడ్, గౌడ పెద్దలు రాయిపల్లి నారాయణ గౌడ్, నలమాస వీరబాబు గౌడ్, బోలగాని సురేందర్ గౌడ్, కోరుకొప్పుల కొమురయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ పాపన్న గౌడ్ పోరాటయోధుడు



**వరంగల్ వాయిస్, కాటారం:** మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి గౌడ్ సంఘం నాయకులు బీఎస్పీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇంచార్జి కందుగుల రాజన్న మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం గొప్ప సందర్భమని పేర్కొన్నారు. మండల కేంద్రంలో అన్ని రాజకీయ పార్టీలలో పనిచేసే నాయకులు అందరూ కలిసి ఒకటై బహుజన వీరుడైన పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. గౌడ సంఘం నాయకులు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీలను కలుపుకొని సైన్యాన్ని ఏర్పాటు చేసి బహుజన రాజ్యాన్ని స్థాపించి గోల్కొండ కోటను ఏలిన మహనీయుడు సర్దార్ పాపన్న గౌడ్ అని కొనియాడారు. మాజీ సర్పంచ్ తిరుపతి గౌడ్ మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ పోరాటయోధుడని యుద్ధ వీరుడు మొఘల్ సైన్యాన్ని ఓడించిన మహావీరుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గోల్కొండ కోటను ఏలిన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఆమహనీయుని అడుగుజాడల్లో నడుద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు రామిల్ల రాకేష్, కల్లుగీత రాష్ట్ర కార్యదర్శి మారుగోని శంకర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు అరిగెల వెంకటరాజం గౌడ్, బుర్ర లక్ష్మయ్య గౌడ్, తాటిబాబు గౌడ్, బొడ్డు రాజబాబు, ఎండి మౌలానా, బీరెల్లి మహేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు



**వరంగల్ వాయిస్, పరకాల :** ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన చూసే ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ లో చేరుతున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తూ బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ పారదర్శక పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసే పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ వీసం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్, వార్డు మెంబర్ వంగరి సమ్మయ్య, మాజీ పద్మశాలి సంఘం అధ్యక్షుడు వంగరి నాగరాజు, కె.భిక్షపతి, పోరెడ్డి కృష్ణారెడ్డి, పోరెడ్డి రమణారెడ్డి, ఎండీ ఇబ్రహీం తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు రెమిడీ బుచ్చిరెడ్డి, సర్పంచ్ బీరం శ్రీలత రామకృష్ణ రెడ్డి, తేనీటి రాజారాంరెడ్డి, కాంతాల కేశవరెడ్డి, కాంతాల రవీందర్ రెడ్డి, చిమ్మని భిక్షపతి చోటే, బలభద్ర రవి, పరికి శ్రీను, పి.భిక్షపతి పాల్గొన్నారు.

## పోచమ్మ గుడికి సదుపాయాలు కల్పిస్తా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని నానామీయా తోటలో స్థానిక ప్రజలు ఏర్పాటు చేసుకున్న తోట పోచమ్మ దేవాలయానికి మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా తోట పోచమ్మ దేవాలయానికి ద్వారబంధం ఏర్పాటుకు పురోహితులు పిల్లలమర్రి హరిహర మంత్రోచ్ఛరణ మధ్య కార్పోరేటర్ మరుపల్ల రవి కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. ప్రథమంగా తోట పోచమ్మ తల్లికి శ్రావణ మాసంలో బోనాలతో నైవేద్యం సమర్పించడానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి సహకారంతో నిధులు తీసుకు వస్తానని ఆయన తెలిపారు. అలాగే దేవాలయానికి చుట్టుపక్కల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని రవి తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాసూరి శ్రీనివాస్, శ్రీపతి కుమార్, బెజ్జం కిషన్, దయ్యాల సుధాకర్, కనుకుంట్ల భరత్, రడం శ్రీనివాస్, నేలపోగుల విజయ, మంద కర్ణాకర్, బెజ్జంకి పావని, వాసూరి రజిత తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుపై సమీక్ష



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రాబోయే ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ 21 ఆగస్ట్ నుండి కొత్త ఓటరు నమోదుకు ఫామ్స్ తీసుకోవడం జరుగుతుందని, మీ పరిస ప్రాంతాల్లో గాని మీ గల్లీల్లో గాని ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని వారిని గుర్తించి వారికి ఓటు హక్కును వినియోగించుకునేలా ఆయా పార్టీల నాయకులు కృషి చేయాలని అన్నారు. ఆయా పార్టీల రాజకీయ పార్టీలు కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కలెక్టర్ మిశ్రా కోరారు. ఈ నెల 19న భూపాలపల్లి కేంద్రంలో జరగబోయే 5కే రన్ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్డీఓ రమాదేవి, ఎలక్షన్ డీటీ అబ్బాస్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ పాపన్న పోరాటం మరువలేనిది



**వరంగల్ వాయిస్, నడికూడ :** బహుజన విప్లవ వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి వేడుకలు హనుమకొండ జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పరకాల మండలంలో సీతారాంపురం గౌడ సంఘం శుక్రవారం నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ దళిత బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చునని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిరూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చిర్ర సారంగపాణి గౌడ్, గౌడ సంక్షేమ సంఘం పరకాల మండల అధ్యక్షుడు తండా రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బుర్ర రాజమౌళి, బుర్ర రామ్మూర్తి గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు తడక వేణు, కోశాధికారి పోశాల భిక్షపతి గౌడ్, సంఘ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, సహాయక కార్యదర్శి జనగాం రాజు, గునిగంటి రామ్మూర్తి, బొమ్మ రాజు, నేరెళ్ల రాజు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బైరి రాజు, పల్లె రాజయ్య, నేరెళ్ల రాజు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక స్ఫూర్తి పాపన్న గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్స్ లో ఆయన చిత్రపటానికి రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని, కుల, మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలనే ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలో పోరాడిన వ్యక్తి పాపన్న గౌడ్ అని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, జిల్లా రైతు బంధు అధ్యక్షురాలు ఏల్లావుల లలితా యాదవ్, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడివెండిలో..



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని కడివెండి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పెద్ది రవీందర్, సత్యనారాయణ, అంజయ్య, అశోక్, వెంకన్న గౌడ్లు, కుల బంధువుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, బస్వ మల్లేశం గౌడ్, పల్ల సుందర్ రాంరెడ్డి, స్థానిక సర్పంచ్ పోతిరెడ్డి బెత్లినా రెడ్డితో పాటు ఉపసర్పంచ్ కషబోయిన నగేష్, దుబ్బాక రత్నాకర్ రెడ్డి, తాటిపెల్లి మహేష్, సుడిగేల హనుమంతు, షఫీ, రఫీల్ రెడ్డి ,మల్లేష్ ,బక్కాజి, శ్రీను, మహేష్, కిష్టయ్య, అంజయ్య, యాదగిరి, ప్రణయ్, రవి, యాకన్న, బాల్ నర్సు, ప్రశాంత్, ఎల్లయ్య, కొమురయ్య, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో యువకులను ఏకం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం శుక్రవారం బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అమరధామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మడికొండ శ్రీను సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు మడికొండ సంపత్ కుమార్, పోరండ్ల సంతోష్, మార్క ఉమాదేవి రఘుపతి, పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, యూత్ నాయకులు ఎండీ.బియ్యబాని, మోలుగురి శ్రీనివాస్, దుప్పటి సుజయ్ రానా, బండి రమేష్ గౌడ్, బండి నరేష్ గౌడ్, బొచ్చు భాస్కర్, రత్న శైలెందేర్, బొచ్చు అంజి, దెయ్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు పరిధిలో గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారుల దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తున్న ఉద్యోగుల పనితీరును కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పరకాల శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు నిర్మించుకునేందకు ఎంపిక చేయడం జరుగుతుందని వార్డు ప్రజలకు భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెరిఫికేషన్ ఆఫీసర్లు ఎస్.విజేందర్, రాధిక, ఆర్పీ జయప్రద, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రచార రథానికి పూజలు



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గ పరిధిలోని పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే ప్రజా సంక్షేమ పథకాలను వివరించేందుకు తిరిగే ప్రచార రథానికి కట్కూరి దేవేందర్ రెడ్డి దంపతులు, నాగారం గ్రామ సర్పంచ్ కట్కూరి స్రవంతి-దేవేందర్ రెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున కార్యకర్తలతో బైక్ ర్యాలీతో పరకాల బస్సు డిపో నుంచి అంబేద్కర్ కూడలి, బస్టాండ్ ఏరియా వరకు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ లో ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా పరకాల పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ, అంబేద్కర్ విగ్రహాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, రాయపర్తి ఎంపీటీసీ పర్నం శ్రీలత-మల్లారెడ్డి, డీసీసీ చేనేత సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాసరి భిక్షపతి, మాజీ ఎంపీపీ వంటేరు రామ్మూర్తి, సీతారాంపురం మాజీ సర్పంచ్ బుర్ర రాజమౌళి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మ కంటి చంద్రమౌళి, కాంగ్రెస్ నేతలు అల్లం రఘు నారాయణ, మంద నాగరాజు, మైనారిటీ సెల్ నాయకులు మహమ్మద్ రంజాన్ అలీ, చందుపట్ల రాజిరెడ్డి, పుట్ట రాజు, మానురి రాజు, కోసరి రాజు, మడికొండ చంగల్, రమేష్ వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంధకారంలో గారెపల్లి

**వరంగల్ వాయిస్, కాటారం :** విష పురుగులు పాములు తేళ్లు ఇంటి పరిసరాలలో సంచరిస్తుండడం వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. గత ఆరు నెలల నుంచి కాటారం గ్రామపంచాయతీ వీధిలైట్లను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కొట్టే శ్రీహరి విమర్శించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడాల్సిన సర్పంచి ఆ దిశగా పనిచేయడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రజల అవసరాలను తీర్చడానికి గ్రామపంచాయతీ కృషి చేయాలని, వీధిలైట్లను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# గద్దర్‌కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ప్రజాకవి, యుద్ధనౌక గద్దర్ కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా "భూపాలపల్లి మదిలో.. గద్దర్ అన్న యాదిలో " అనే స్లోగన్ తో ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, పురవీధుల గుండా, కాలినడకన భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు వక్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు గద్దర్‌ను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



**వరంగల్ వాయిస్, పరకాల :** అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో పాలన సాగిస్తున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటనష్ట పోయిన 142 మంది రైతులకు రూ.14లక్షల 37వేల విలువైన నష్టపరిహారం చెక్కులు శుక్రవారం అంద జేశారు. అలాగే సంగెం మండలం వెంకటాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా రూ.70లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, మహిళా భవనం, గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నియోజకవర్గంలోని కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, ప్రజలందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

### రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం..

రైతులకు అండగా ఎల్లప్పుడూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిచిందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు గాను వెంకటాపురం గ్రామంలో 142మంది రైతులకు గాను రూ.14 లక్షల 37 వేల విలువైన నష్టపరిహారం చెక్కులు జిల్లా కలెక్టర్ ప్రావీణ్తో కలిసి పంపిణీ చేశారు. ఒక్క సంగెం మండలంలో 7187.31 ఎకరాల పంట నష్టం వాటిల్లిందని అన్నారు.రూ.7కోట్ల 19లక్షలు ప్రభుత్వం రైతులకు అందిస్తున్నట్లు వారు తెలిపారు.

### రహదారులకు మహర్ధశ..

సంగెం మండలంలో పలు గ్రామాలకు అనుసంధానంగా ఉండే 6 రహదాలకు రూ.18కోట్లు 45లక్షల నిధులు మంజూరు కావడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. అడగగానే నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల రాస్తారోకో



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తెలంగాణలో కేసీఆర్ సీఎంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అర్హులైన అన్ని వర్గాలకు ప్రజలకు అందించడంలో వైఫల్యం చెందిన కారణంగా ప్రజల పక్షాన బీజేపీ పరకాల నియోజకవర్గం పార్టీ ఆధ్వర్యంలో గీసుకొండ క్రాస్ రోడ్డు వద్ద బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య తోపులాటతో గీసుకొండ రణరంగంగా మారింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ చందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ నారాయణరావు, కాచం గురు ప్రసాద్, పరకాల కౌన్సిలర్లు దేవనూరు మేఘనాథ్, కొలనుపాక భద్రయ్య, కైరిక రవికుమార్, ముత్యాల శ్రీనివాస్, బాసాని సోమరాజ్, మూల్క ప్రసాద్, రతన్ కుమార్, మండల అధ్యక్షుడు నిమ్మగడ్డ జాన్ విక్రమ్, బుట్టి కుమారస్వామి, పుట్ట రవీందర్, ఈర్సట్ల సదానందం, జంగిలి నాగరాజ్, డివిజన్ అధ్యక్షులు గోదాసి అశ్విన్ కుమార్, బిల్లా రమేష్, ఇదగాని నవీన్ కుమార్, కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతి కుమార్, జిల్లా కోశాధికారి పగడాల రాజకుమార్, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరకట్ల ప్రవీణ్, బూర్గుల యుగేందర్, కత్తి రమేష్, మరిపూడి శ్రీనివాస్, గడ్డమీద బాలరాజు, మరిప్పుడు రోశయ్య, డాక్టర్ రాజిరెడ్డి, దివాకర్, దేవరాజ్, గీసుకొండ, సంగెం, 15, 16, 17వ నడికూడ, పరకాల, దామెర, ఆత్మకూర్ మండలాల/డివిజన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కామాంధులకు ఉరిశిక్ష విధించాలి

## బహుజన సమాజ్ పార్టీ డిమాండ్



**వరంగల్ వాయిస్, కాటారం :** పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామంలో 15సంవత్సరాల మైనర్ బాలికపై అక్కడి కొంతమంది వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడడంతో బాలిక మృతి చెందిందని, బాలిక మరణానికి కారకులైన కామాంధులకు ఉరిశిక్ష విధించాలని మంథని నియోజక వర్గం బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. మధ్యప్రదేశ్ కు చెందిన 15ఏళ్ల అమ్మాయిపై అక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు నలుగురు అత్యాచారం చేయడంతో బాలిక చనిపోయిందని, ఈ సంఘటనకు కారకులైన నలుగురిని ఉరి తీయాలని బహుజన సమాజ్ పార్టీ మంథని నియోజక వర్గం నాయకులు రామిల్ల రాకేష్ అన్నారు. ఈ మేరకు బాలిక మృతికి సంతాప సూచకంగా మంథని నియోజకవర్గ కేంద్రంలోని చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బాలిక కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వారు కోరారు. అప్పన్నపేట ఘటనపై సీబీసీఐడీ చేత విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

# నాణ్యమైన ఆహారం అందించాలి

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ నవీన్ రావు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** పట్టణ ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారం అందించాలని మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ లో స్పందన హోటల్, ఫాస్ట్ ఫుడ్, టీ, టిఫిన్స్ సెంటర్ ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, డాక్టర్ రవి కుమార్, కౌన్సిలర్స్ పానుగోతు సుజాత వెంకన్న, లలిత వెంకటేశ్వర్లు, ప్రగతి శ్రీపాల్ రెడ్డి, బానోత్ కిషన్ నాయక్, శ్రీనివాస్, భయ్యు భిక్షం, బోడ శ్రీను, హుస్సేన్, పాషా, దిగజర్ల శ్రీనివాస్, కేసముద్రం మార్కెట్ డైరక్టర్ మహిపాల్ రెడ్డి, గంధసిరి క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనలో ప్రభుత్వ సంస్థల నిర్వీర్యం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ ఆస్తులు విధ్వంసం చేస్తున్నారని కేంద్రంలోని బీజేపీ, మోడీ ప్రభుత్వాన్ని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ దుయ్యబట్టారు. శుక్రవారం మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తో పాటు కలిసి భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి వచ్చిన ఆయన ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం పక్కన తాళాలు వేసి నిరుపయోగంగా ఉన్న బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ చూసి కేంద్ర ప్రభుత్వం మీద ధ్వజమెత్తారు. మన దేశంలో స్వతంత్రం వచ్చిన తర్వాత మన పూర్వ పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వేలు, జాతీయ రహదారులు, పోస్ట్ ఆఫీసులు, బ్యాంకులు, టెలికమ్యూనికేషన్ వ్యవస్థను నెలకొల్పారు. ప్రజల సౌకర్యం కోసం గత 75 సంవత్సరాలుగా ఆయా రంగాలు సేవలు అందించాయి, కానీ, ఇప్పుడు 75 సంవత్సరాల స్వాతంత్ర స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటు పరం చేసి వాటి ఉనికిని ప్రశ్నార్థకం చేస్తుందన్నారు. అందుకు ముల్కనూరు గ్రామంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ నిదర్శనంగా చెప్పుకోవచ్చని, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ లో టవర్ పై కూడా చెట్లు మొలిచి ప్రభుత్వ ఆస్తులు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఇది కేవలం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా పాలన వ్యతిరేక విధానాలతోనే జరిగిందన్నారు. బీఎస్ఎన్ఎల్, ఎయిర్ ఇండియా, రైల్వే, భారత్ పెట్రోలియం, షిప్పింగ్ కార్పొరేషన్, కంటైనర్ కార్పొరేషన్, పోర్టులు, నేషనల్ హైవేలు వంటి ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిని అమ్మేస్తున్నారు. ప్రశ్నిస్తే దేశ ద్రోహి అనే ముద్ర వేస్తున్నారని ధ్వజమెత్తారు. మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్ల రాజకీయం చేస్తు పబ్బం గడుపుతున్న బీజేపీకి త్వరలోనే బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు.

## పంతకాని రాజుకు జాతీయ స్థాయి అవార్డు

### పద్మశాలి ముద్దు బిడ్డకు ప్రశంసలు




**వరంగల్ వాయిస్, కాటారం :** మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన వర్ధమాన ఛాయా చిత్రకారుడు పంతకాని రాజుకు ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా(పీఏఐ) సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్(ఐఐపీసీ) సహకారంతో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఆగస్టు 19 సందర్భంగా నిర్వహించిన నేషనల్ లెవెల్ ఫొటో కాంటెస్ట్ లో ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. విజయవాడ పట్టణంలోని బాలోత్సవ్ భవన్ లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పీఏఐ పౌండర్ చైర్మన్ టి. శ్రీనివాస రెడ్డి, ప్రముఖుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గిరిజనులపై నిర్వహించిన కాంటెస్ట్ లో ఈ అవార్డు దక్కడం విశేషమని, కవర్ పేజీపై నేను తీసిన ఛాయా చిత్రాన్ని ప్రదర్శించిందుకు సంతోషంగా ఉందని అవార్డ్ గ్రహీత రాజు అన్నారు. ఈ అవార్డు వచ్చినందుకు మహదేవపూర్ వాసిగా గర్వపడుతున్నానని అన్నారు. పద్మశాలి ముద్దు బిడ్డ పంతకాని రాజు జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ అందుకోవడం ఆనందదాయకం, అభినందనీయమని పద్మశాలి ప్రొఫెషనల్స్, అఫిషియల్స్ అసోసియేషన్ నేత గాదెరమేష్ అన్నారు.

## కుష్ఠు వ్యాధి నిర్ధారణపై సర్వే



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అమ్మాపురంలో వైద్య సిబ్బంది కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం చేపట్టినట్లు డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనాకర్ రెడ్డి, సీహెచ్ ఓ విజయ్ కుమార్ తెలిపారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి అందరినీ పరీక్షించి శరీరం మీద స్పర్శ లేని, రాగి రంగు లేక లేత గోధుమ రంగు మచ్చలు గుర్తించి వారి పేర్లు నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఏవరికైనా వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యాధికారితో వ్యాధి నిర్ధారణ చేయించి ఉచితంగా చికిత్స అందజేస్తామన్నారు. ఈ సర్వేలో ఆశాకార్యకర్తలు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు గృహ సందర్శన చేసి కాళ్లు, చేతులలో తిమ్మిరి, చేతి లేదా పాదాల వేళ్లు వంకర కావడం, పుండ్లు ఉన్నట్లైతే అది కుష్టు వ్యాధి కావచ్చని, వెంటనే చికిత్స అందించినట్లయితే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు. ముఖ్యంగా కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించినట్లయితే నూటికి నూరు శాతం నివారించవచ్చునని తెలిపారు. ప్రజలు ఇంటి ఇంటి సర్వే కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలకు సహకరించి తగిన చికిత్స పొందగలరని కోరారు. మన మండలంలో అన్ని గ్రామాలలో ఈ నెల 16 నుంచి 31 వరకు సర్వే చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతి కృష్ణ అప్తాలిక్ ఆఫీసర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఎన్నికల హామీలు ఏమాయే?

### బీజేపీ అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి ఆరోపించారు. వెంటనే డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలనే డిమాండ్ తో తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు, భూపాలపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు కన్నం యుగంధర్ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేరలేదన్నారు. ఏండ్లు గడుస్తున్నా ఇంకా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయలేదని మండిపడ్డారు. కేంద్రం భారీగా నిధులు కేటాయించినా .. హడ్కో నుంచి రుణాలను పెద్ద ఎత్తున మంజూరు చేయించినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వాటి నిర్మాణాలను ఇంకా పూర్తి చేయకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఓట్ల కోసం తప్ప కేసీఆర్ కు అభివృద్ధి పై చిత్తశుద్ధి లేదని, సంక్షేమం ఆయనకు పట్టదని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ నెరవేరలేదని మండిపడ్డారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాలు జలమయమై పంట నష్టం, ఆస్తి నష్టం జరిగిందని, వారిని ఈ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ధ్వజమెత్తారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తోందని విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీలే ఇంకా నెరవేర్చిన ప్రభుత్వం ఇప్పుడు ప్రారంభిస్తున్న పనులు ఎప్పుడు పూర్తి చేస్తుందని కీర్తి రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కీర్తి రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడునూతుల నిషీధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి ప్రసాద్ రావు, పట్టణ అధ్యక్షుడు సామల మధూసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బట్టు రవి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు దొంగల రాజేందర్, రూరల్ మండల అధ్యక్షుడు ఇచ్చంతుల విష్ణు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సత్యవతి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్, నాయకులు తుమ్మేటి రామ్ రెడ్డి, గీస సంపత్, కంబాల రాజయ్య, మాచనేని రవీందర్, నాంపల్లి కూమార్, దొంగల కూమార్, శివనాత్రి వేణు, మాలతి, మండల అధ్యక్షులు జిట్టబోయున సాంబయ్య, బుర్ర వేంకటేష్ గౌడ్, వైనాల కూమార్, వేణు గోపాల్ రెడ్డి, సంఘ రఘుపతి మణి గౌడ్, దాసరి అనిల్, జిల్లా పదాధికారులు, జిల్లా పలు మోర్చా నాయకులు, బీజేవైఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్ లో హనుమకొండ జిల్లాకు చెందిన ఉప్పుల సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి భార్య ఉప్పుల శేష కుమారి సహకారంతో వరంగల్ ఆటోనగర్ లో ఉన్న లూయిస్ ఆదర్శ బ్లైండ్ స్కూల్లో ఉన్న చిన్నారులకు 236వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్ , కన్నె రాజు, బొట్టు కమలాకర్ , కోలా రాజేష్, గజ్జెల సుమన్, ఉప్పుల శేషు కుమారి, అలువల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, సృజన, పాలకుర్తి విష్ణు, రాచకట్ల కృష్ణ, బిటుకూరి యాకయ్య, జ్యోతి, భావన, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, వైనాల రమేష్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తీక్ పాల్గొన్నారు.

## కొత్తగట్టు సింగారంలో మెగా రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కొత్తగట్టు సింగారంలో మాజీసర్పంచ్ పెంబర్తి చంద్రమౌళి, సత్యనారాయణ (చంటి) జ్ఞాపకార్థంగా గ్రామ యువత ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని యూపీఎస్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా బరిగెల సుదర్శన్ వచ్చారు. అనంతరం సీహెచ్ సీ బ్లడ్ బ్యాంక్ పరకాల వారు ప్రశంస పత్రాన్ని ప్రదానం చేశారు. డాక్టర్ అరుణ్ కుమార్, వారి సిబ్బంది ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బరిగల సుదర్శన్ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ గ్రామంలోని యువత ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని గ్రామంలో ఉన్న యువతకు సూచించారు. ఈ శిబిరంలో కుకిడి ప్రసాద్, నాగేశ్వరరావు, పెంబర్తి భరత్, శరత్, పెంబర్తి అఖిల్, నవీన్, కపిల్, సాయి, వినయ్, లక్ష్మణ్, శ్రీధర్, నవీన్, సునీల్ రక్తదానం చేశారు. గ్రామంలో ఉన్న పెద్దలు నాయకులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లబ్ధి కోసమే గృహలక్ష్మి పథకం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకువస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శాయంపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చిందని కానీ, వాటిని డబ్బా ఇండ్లతో పోల్చి అవహేళన చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చి 9సంవత్సరాలు పూర్తయిన శాయంపేట మండలంలో ఇల్లు లేని నిరుపేదలకు ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కూడా నిర్మించకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ లాగా గ్రామాలలో ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇండ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ తరపున డిమాండ్ చేశారు.

# డిఫరెంట్ కాన్సెప్ట్‌తో మిస్టర్ ప్రెగ్నెంట్



బిగ్‌బాస్ షోతో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు సయ్యద్ సోహెల్ ర్యాన్ లక్కీ లక్ష్మణ్ తర్వాత సోహెల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం మిస్టర్ ప్రెగ్నెంట్ . శ్రీనివాస్ వింజనంపాటి డైరెక్ట్ చేశాడు. రూప కొడవయూర్ హీరోయిన్‌గా నటించింది. వినూత్న కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది.కథానుగుణంగా హీరోయిన్‌కు బదులు హీరోకు ప్రెగ్నెన్సీ వస్తే అతడు ఎలాంటి బాధలు ఎదుర్కొన్నాడు.. చివరికి బిడ్డకు జన్మనిచ్చాడా..లేదా..? అనే లైన్‌తో సాగే సినిమాకు మంచి స్పందన వస్తోంది. మిస్టర్ ప్రెగ్నెంట్ ఇప్పటివరకు ఎవరూ ప్రయత్నించని, సరికొత్త కాన్సెప్ట్‌తో సాగుతూ ప్రత్యేకించి మహిళలను బాగా ఇంప్రెస్ చేస్తుందని అంటున్నారు. మిస్టర్ ప్రెగ్నెంట్ కాన్సెప్ట్ అందరూ ఒప్పుకునేలా ఉందని.. యూనిక్ పాయింట్‌ను తీసుకొని విభిన్నమైన కథాంశాన్ని డైరెక్టర్ శ్రీనివాస్ ఆమోదయోగ్యంగా తెరకెక్కించారని చెబుతున్నారు. సోహెల్ అద్భుతంగా నటించాడని, రూపా కొడవయూర్ తన యాక్టింగ్‌తో మెస్మరైజ్ చేస్తోందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. యూనిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా కలెక్షన్లు ఎలా ఉండబోతున్నాయన్నది రానున్న రోజుల్లో స్పష్టత రానుంది. మిస్టర్ ప్రెగ్నెంట్ ప్రమోషన్స్‌లో భాగంగా మహిళల కోసం స్పెషల్ స్క్రీనింగ్ కూడా ఏర్పాటు చేశారని తెలిసిందే. ఇందులో భాగంగా గర్భిణీలతో ప్రత్యేకంగా చిట్ చాట్ చేశాడు సోహైల్. టైటిల్‌కు తగ్గట్టుకుగా సరికొత్తగా చేసిన ప్రమోషన్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి.

# మామన్నన్
## 50 డేస్ సెలబ్రేషన్స్



సెషల్ అట్రాక్షన్‌గా కీర్తి సురేశ్ పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో డైరెక్టర్ మారి సెల్వరాజ్ తెరకెక్కించిన మామన్నన్ చిత్రంలో నేషనల్ అవార్డు విన్నింగ్ బ్యూటీ కీర్తిసురేశ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. జూన్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. తర్వాత తెలుగులో కూడా విడుదల కాగా.. సూపర్ రెస్పాన్స్ వచ్చింది. మామన్నన్ మేకర్స్ నిర్వహించిన 50 డేస్ సెలబ్రేషన్స్‌లో కీర్తిసురేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జీబ్రాను పోలిన చారలతో డిజైన్ చేయబడ్డ చీరకట్టులో ఈవెంట్‌కే స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. అందానికే అసూయ పుట్టేలా కనిపిస్తున్న మహానటి ట్రెడిషనల్ లుక్ నెట్టింటిని షేక్ చేస్తోంది.మామన్నన్ చిత్రంలో మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటించగా.. తన యాక్టింగ్‌తో సినిమా సక్సెస్‌లో కీలక పాత్ర పోషించాడు. ఈ చిత్రాన్ని రెడ్ జియాంట్ మూవీస్‌పై ఎం షెంగబాగ్ మూర్తి, ఆర్ అర్జున్ దురై నిర్మించారు. ఈ మూవీకి ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించాడు.

# కన్నప్ప చిత్రానికి మంచు విష్ణు శ్రీకారం

మంచు విష్ణు కలల చిత్రం 'భక్త కన్నప్ప'ఎంతో కాలంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాలని ఆయన తపన పడుతున్నారు. ఎట్టకేలకు ఈ చిత్రానికి ముహూర్తం కుదిరింది. 'కన్నప్ప' చిత్రాన్ని శ్రీకాళహస్తిలో పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. భారీబడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిల ఈ చిత్రాన్ని నిర్మించడానికి మంచు విష్ణు ప్లాన్ చేస్తున్నారు. అవా ఎంటర్‌టైన్మెంట్ మరియు 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కృతి సనాన్ సోదరి నుపుర్ సనన్ విష్ణు మంచు సరసన కథానాయికగా కనిపిస్తారు. స్టార్‌ప్లస్‌లో ప్రసారమయ్యే 'మహాభారత్' సిరీస్‌కి దర్శకత్వం వహించిన ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.సీనియర్ రచయితలు పరుచూరి గోపాలకృష్ణ, బుర్ర సాయిమాధవ్, తోట ప్రసాద్ ఈ కథకు తుది మెరుగులు దిద్దారు. మణిశర్మ, స్టీఫెన్ దేవాసి సంగీతం అందిస్తున్నారు. అత్యంత భారీ బ్జడెట్ తో, హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో భక్త కన్నప్ప, అతని గొప్పతనాన్ని ఈ తరానికి కూడా తెలియజేస్తాం. త్వరలో షూటింగ్ మొదలుపెట్టి సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేస్తాం. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో గొప్ప నటీనటులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తారు' అని విష్ణు తెలిపారు.





# నిఖిల్ స్వయంభు షూటింగ్ ప్రారంభం

'కార్తికేయ2'తో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు నిఖిల్. తర్వాత మిస్టరీ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'స్పై'తో ప్రేక్షకులను అలరించారు. తాజాగా మరో విభిన్నమైన కథతో అలరించడానికి సిద్ధమయ్యారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో 'స్వయంభూ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. శుక్రవారం ఈ చిత్రం షూటింగ్ ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానంలో పూజా కార్యక్రమాలు మొదలుపెట్టారు. ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. దిల్ రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. ట్విట్టర్ వేదికగా నిఖిల్ ఈ విషయాన్ని తెలుపుతూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. గుర్రంపై ఉన్న నిఖిల్ లుక్ ఆకట్టుకుంటోంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో పోరాట యోధుడిలా కనిపించనున్నారు. ఆయన సరసన సంయుక్త మేనన్ కథానాయికగా నటించనున్నారు. నిఖిల్ కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రంగా ఈ చిత్రం రూపొందనుంది. ఠాగూర్ మధు సమర్పణలో భువన్-శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతోపాటు సుధీర్ వర్మతో నిఖిల్ ఓ సినిమా చేస్తున్నారు. రామ్ చరణ్ సమర్పణలో 'ది ఇండియా హౌస్' పేరుతో ఇది తెరకెక్కనుంది. అలాగే 'కార్తికేయ 3' కూడా పైప్‌లైన్‌లో ఉంది. ఇప్పుడున్న కుర్ర హీరోల్లో కాస్త డిఫరెంట్‌గా, అవుట్ ఆఫ్ ది బాక్స్ కంటెంట్‌తో సినిమాలు చేస్తుంది ఒక్క నిఖిల్ మాత్రమే. పెద్ద పెద్ద స్టార్‌లు సైతం నిఖిల్ స్క్రిప్ట్ సెలక్షన్ చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికే కార్తికేయ-2తో పాన్ ఇండియా లెవల్లో సాలిడ్ మార్కెట్ పెంచుకున్న నిఖిల్.. అలాంటివే మరో రెండు హిట్లు పడితే టైర్1 హీరోల సాటి నిలివడం ఖాయం. యుద్ధ వీరుడి గెటప్‌లో ఉన్న నిఖిల్ లుక్‌కు ఫిదా అవని సినీ ప్రేక్షకుడు లేడు. తాజాగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ మేరకు మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. గుర్రపు స్వారిపై డ్రాగన్ నోటిలో మంటలు చెలరేగుతున్న బాణం ఎక్కుపెట్టి యుద్ధ వీరుడుగా ఉన్నట్లు నిఖిల్ పోస్టర్‌ను డిజైన్ చేశారు.

# సర్వాయి పాపన్న వ్యక్తి మాత్రమే కాదు.. ఆయన ఒక శక్తి

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**వరంగల్ వాయిస్ తొర్రూరు :** సర్వాయి పాపన్న కేవలం వ్యక్తి మాత్రమే కాదు శక్తి.. నిజాం పాలనపై తిరుగుబాటు బాహుట ఎగురవేసిన ధీశాలి..సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ అతి గొప్ప స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి అంటూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కొనియాడారు. ఆయన మన ప్రాంతంలో పుట్టడం మన అదృష్టం.. ఆయన పోరాటం భావి తరాలకు స్ఫూర్తి దాయకం అన్నారు. అందుకే సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతితును ప్రభుత్వమే నిర్వహిస్తోందని ప్రకటించారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులో ఆయన విగ్రహానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం పెద్ద వంగర మండలం కాన్వాయి గూడెంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తిగా రాష్ట్ర రాజధానిలో ఐదు ఎకరాల స్థలంలో సర్వాయి పాపన్న పేరుతో ఒక స్మారక భవనం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో గౌడ కమ్యూనిటీ హాలు కట్టించానన్నారు. గిరక తాళ్ళు ఏర్పాటు చేయడం ద్వారా గౌడలకు ఆదాయం రెట్టింపు అవుతుందని సూచించారు. ఆ దిశగా గౌడలు ఆలోచించాలన్నారు. వైన్ షాపుల్లో ఇప్పటికే 15శాతం రిజర్వేషన్లు కల్పించామని, కంఠ మహేశ్వర దేవుడి పేరున నియోజకవర్గంలో 20కి పైగా దేవాలయాలు నిర్మించడంతోపాటు అన్ని రంగాల్లో ముందున్నామన్నారు. అనంతరం మంత్రి కాన్వాయ్ గూడెంలో పరువురికి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు అగ్రనేత రాజిరెడ్డి మృతి

**వరంగల్ వాయిస్, కాటారం :** మావోయిస్టు అగ్రనేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ సాయన్న అలియాస్ మీసాలన్న అలియాస్ అలోక్ అలియాస్ దేశ్ పాండే అలియాస్ గోపన్న అనారోగ్యంతో మృతి చెందినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే అటు మావోయిస్టు పార్టీ నేతలు కానీ ఇటు పోలీసులు కానీ రాజిరెడ్డి మృతిపై ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్ పరిధిలోని శాస్త్రులపల్లికి చెందిన మల్లా రాజిరెడ్డి ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారు. 2009లో రాజిరెడ్డిని పోలీసులు అరెస్టు చేయగా 2013లో విడుదల కాగానే తిరిగి అజ్ఞాతంలోకి వెళ్ళారు. ప్రస్తుతం రాజిరెడ్డి వయస్సు 70 సంవత్సరాలు. రాజిరెడ్డిపై కోటిరూపాయల నజరానా ఉంది. ఛత్తీస్ ఘడ్, ఒరిస్సా దండకారణ్యంలో రాజిరెడ్డి మావోయిస్టు పార్టీలో అతికీలకంగా వ్యవహరిస్తున్నారు.

## సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యూలర్ చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యూలర్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, వరంగల్ జిల్లా జిల్లా కేంద్రంలోని ఏకశిలా పార్క్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె వుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. దీక్షను ఉద్దేశించి ఏఐటీయూసీ మాజీ జాతీయ కమిటీ సభ్యులు, వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పనాస ప్రసాద్ మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా సేవలందిస్తున్నసెకండ్ ఏఎన్ఎం లందరినీ, ఎగ్జామ్ తో సంబంధం లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, గోవర్ధన చారి, ఉపాధ్యక్షులు యండి యాకూబ్, జాన్ పాల్, సుజాత, రజిత, సాలమ్మ, మంజుల, పద్మ, కరుణ, సునీత, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.





## భక్తులతో పోటెత్తిన అమ్మవారి ఆలయాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. చరిత్ర ప్రసిద్ధి గాంచిన భద్రకాళి దేవస్థానంలో తెల్లవారు జామునుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వరంగల్ ఎంజీఎం రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయానికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. హంటర్ రోడ్డులోని సంతోషిమాత దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల దర్శనార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## లీడర్లు ఫుల్..ఓట్లు నిల్

### ఈ సారి గొల్లచర్లలో మెజార్టీ రావాలి
### ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మండలంలోని అనేక గ్రామాల్లో సుమారు రూ.50 కోట్ల నిధులతఓ సీసీ రోడ్లు, బీటి రోడ్లు వేయిస్తున్నామని ఇందుకు ప్రతిఫలంగా ప్రజలు కారు గుర్తుకు ఓట్లు వేసి తనను మరో మారు గెలిపించాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని గొల్లచర్ల హూన్య తండా, దుబ్బ తండ గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గొల్లచెర్లలో గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ...గొల్లచర్ల తోపాటు చుట్టూ ఉన్న తండాలలో తనకు ఎప్పుడూ తక్కువ ఓట్లే వస్తాయన్నారు. గడిచిన ఎన్నికల్లో గొల్లచర్ల గ్రామంలో 750 ఓట్లు బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ కే మేజార్టీ వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంతే కాకుండా గొల్లచర్ల చుట్టూ ఉన్న 18 తండాలలో కూడా తనకు ఓట్లు రాలేదన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలకు కట్టుబడి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గొల్లచర్ల గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న తండాల్లో సుమారు రూ.10 కోట్ల తో సీసీ, బీటీ రోడ్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు. గొల్లచర్ల గ్రామంలో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, హూన్య తండా గ్రామంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, రూ.50 లక్షలతో బీటి రోడ్, రూ.5 లక్షలతో గోదాతండలో నూతన బావి నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. ఇంతే కాకుండా రాము తండా నుంచి గార్ల మండలానికి లింకు రోడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లోని ప్రజలు అభివృద్ధిని గమనించి తనకు మరో మారు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. ముఖ్యంగా గొల్లచర్ల గ్రామంలో ఇద్దరు సీనియర్ లీడర్లు ఉన్నందున జరగబోయే ఎన్నికల్లో గొల్ల చర్ల గ్రామం నుంచి 1000 ఓట్ల మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలు నాయక్, తెరాస మండల అధ్యక్షుడు నున్న రమణ, సొసైటీ చైర్మన్ భిక్షం రెడ్డి, సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ మేకపోతుల రమ్య, సర్పంచులు సమ్మిరెడ్డి, బాలాజీ, దేవి శంకర్, రాయల వెంకటేశ్వర్లు, కొడవండ్ల వెంకన్న పాల్గొన్నారు.

## సార్వత్రిక విద్య సులభమైనది

### మర్కజీ స్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సార్వత్రిక విద్య ఎంతో సులభమైనదని, హనుమకొండ జిల్లా మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఉమా దేవి, ఓపెన్ స్కూల్ వరంగల్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురాల శంకర్ రావు అన్నారు. శుక్రవారం మర్కజీ పాఠశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్, బ్రోచర్, ప్రాస్పెక్టస్ ను ఆవిష్కరించారు. అనంతరం హెచ్ ఎం మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, వివిధ వృత్తి పనుల వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకొని ఆదివారాలు, సెలవు దినాలలో ముఖా ముఖి తరగతులకు హాజరై కోర్సు పూర్తి చేయవచ్చన్నారు. ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శంకర్ రావు మాట్లాడుతూ ఓపెన్ టెన్త్, ఇంటర్ లో ప్రవేశాలు పొందగోరే అభ్యర్థులు అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించి వారి సూచనల మేరకు ఆన్ లైన్ లో సంబంధిత రుసుము చెల్లించి ప్రవేశాలు పొందాలన్నారు. ప్రవేశాలకు అపరాద రుసుముతో చివరి తేదీ ఆగస్టు 31 వరకు ఉందన్నారు. ఓపెన్ టెంత్ కోసం అడ్మిషన్ ఫీజ్ జనరల్ వారికి రూ.1550, ఇంటర్మీడియట్ కు రూ.1800 లని, టెన్త్ రిజర్వుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు రూ.1150లని, ఇంటర్మీడియట్ వారికి రూ.1500 తో పాటు ఆన్ లైన్ చార్జీలు అదనంగా చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వలుస పైడి, శ్రీనివాస్, నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, స్వామి, నాగరాజు, సారంగపాణి, రమేష్, అవినాస్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com